సాక్షి
వైఎస్సార్ జిల్లా
శనివారం । 15 । ఏప్రిల్ । 2023



ఆధ్యాత్మిక నిలయం.. చిన్మయారణ్యం

ఓబులవారిపల్లె మండలం ఎల్లాయపల్లెలో ఆధ్యాత్మికతకు నిలయంగా చిన్మయారణ్య ఆశ్రమం నిర్వహిస్తున్నారు. -8లో..



ఐదుగురు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్ట్

ఐదుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేసి, 23 దుంగలు, రెండు కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. -8లో..



గంజాయి ముఠా ఆటకట్టు

ప్రొద్దుటూరు పరిధిలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు చేస్తున్న ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. -8లో..

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శని (సా॥)	సహర్ ఆది (ఉ॥)
కడప	6.31	4.45
ప్రొద్దుటూరు	6.30	4.49
పులివెందుల	6.34	4.50

న్యూస్‌రీల్

16న జిల్లా స్థాయి చదరంగం టోర్నమెంట్

కడప స్పోర్ట్స్: కడప నగరం మస్తాన్‌వలీవీధిలోని చదరంగం హాల్‌లో ఈనెల 16వ తేదీ ఉదయం 15వ అష్రఫ్–ప్రసన్న మంత్రీ రోలింగ్ ట్రోఫీ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా చదరంగం అసోసియేషన్ కార్యదర్శి బి. అనీస్ దర్బారీ తెలిపారు. వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు 83412 55151 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

25 నుంచి వైవీయూ పీజీ సెమిస్టర్ పరీక్షలు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయానికి సంబంధించి పోస్టు గ్రాడ్యుయేషన్ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25 నుంచి ప్రారంభం కానున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి తెలిపారు. ఈనెల 25 నుంచి ప్రథమ సెమిస్టర్ పరీక్షలు, 26 నుంచి మూడో సెమిస్టర్ పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలు మేనెల 8వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు.

16న జిల్లాస్థాయి హాకీ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడామైదానంలో ఈనెల 16వ తేదీ ఉదయం 9 గంటలకు జిల్లాస్థాయి సీనియర్ పురుషుల విభాగం హాకీ ఎంపికలు, టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు వైఎస్ఆర్ జిల్లా హాకీ సంఘం అధ్యక్షుడు ఎ. శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేస్తామని తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు సత్యసాయిజిల్లా ధర్మవరంలో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ సీనియర్ హాకీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. 1994 జనవరి 1 తర్వాత పుట్టినవారు ఎంపికలకు అర్హులన్నారు. 16వ తేదీ ఉదయం క్రీడాకారులు సీనియర్ హాకీ కోచ్ ఎ. రమేష్‌బాబు వద్ద రిపోర్ట్ చేయాలని సూచించారు.

అగ్ని ప్రమాదాల నివారణకు కృషి



మాట్లాడుతున్న న్యాయమూర్తి సీ.ఎన్. మూర్తి

కడప అర్బన్: అగ్ని ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఇన్‌ఛార్జ్ ప్రధాన న్యాయమూర్తి సీ.ఎన్. మూర్తి తెలియజేశారు. అగ్నిమాపక వారోత్సవాల ప్రారంభం సందర్భంగా శుక్రవారం కడప అగ్నిమాపక కేంద్రంకు ముఖ్యఅతిథిగా సీ.ఎన్. మూర్తి విచ్చేశారు. ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని పూలమాల వేసి నివాళులు అర్పించారు. అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించే కరపత్రాలను, గోడపత్రాలను ఆవిష్కరించారు. రీజనల్ ఫైర్ ఆఫీసర్ ఎం. భూపాల్ రెడ్డి మాట్లాడుతూ అగ్నిమాపక సేవలగురించి వివరించారు. జిల్లా అగ్నిమాపక అధికారి రామ్ ప్రకాష్, కడప అగ్నిమాపక కేంద్రం అధికారి, జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి పి. బసివిరెడ్డి మాట్లాడారు.

దేశభక్తి, సేవాభావం అలవర్చుకోవాలి

కడప ఎడ్యుకేషన్: స్కౌట్ విద్యార్థులు దేశభక్తితోపాటు సేవాభావాన్ని అలవరచుకోవాలని ఆదర్శ పాఠశాలల రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ మార్తాల వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కడప శంకరాపురంలోని స్కౌట్ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం ఉమ్మడి జిల్లాలోని 17 ఆదర్శ పాఠశాలల విద్యార్థులకు సమగ్రశిక్ష ద్వారా మంజూరు చేసిన స్కౌట్ అండ్ గైడ్స్ యూనిఫాంను పంపిణీ చేశారు. అలాగే బేసిక్, అడ్వాన్స్ శిక్షణపొందిన స్కౌట్ మాస్టర్‌లకు, గైడ్ కెప్టెన్‌లకు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు క్యాంపు సర్టిఫికెట్లను అందచేశారు. తదనంతరం అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కౌట్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్ పాల్గొన్నారు.

శుభకార్యంలో మరణమృదంగం

- విషాదంలో కొత్తపల్లె, వడిగలవారిపల్లె
- మృత్యువులో తోడుగా అవ్వా, మనవడు
- ఒకే కుటుంబానికి చెందిన మరో ఇద్దరు మృతి
- మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- ముగ్గురిని కాపాడి గాయపడిన సునీత



విద్యుత్ తీగలకు తగిలిన షామియాన ఇనుప పైపు



ఘటన తర్వాత చెల్లాచెదురుగా పడిన కుర్చీలు, టేబుళ్లు



చిన్నలక్ష్మమ్మ మృతదేహం



విజయ్‌ప్రశాంత్ (ఫైల్)



శాంతికుమారి (ఫైల్)



లక్ష్మణ (ఫైల్)

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలం గుమ్మసముద్రం పంచాయతీకి చెందిన కొత్తపల్లె, వడిగలవారిపల్లెల్లో తీవ్ర విషాదం నెలకొంది. శుక్రవారం పెద్దతిప్పసముద్రం మండలం కానుగమాకులపల్లెలో కే.కృష్ణారెడ్డి గృహప్రవేశ వేడుక జరిగింది. ఈ వేడుకకు ఎక్కడెక్కడో ఉన్న బంధువులు, మిత్రులు హాజరై ఒకరినొకరు పలుకరించుకొంటూ గడిపారు. మధ్యాహ్నం భోజనం చేసేందుకు సిద్ధమైన అతిథులకు సుడిగాలి మృత్యువులా ముంచుకొచ్చింది. తీవ్రమైన గాలికి షామియానా విద్యుత్ తీగలపై పడి మృత్యు ఘంటికలు మోగాయి. ఈ ఘటన సమయంలో 15 మంది భోజనాలు చేస్తుండగా వారిలో కొత్తపల్లె, వడిగలవారిపల్లెకు చెందిన తిరుమల, కొండకమర్ల కుటుంబాలకు చెందిన నలుగురి ప్రాణాలు బలవగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడగా.. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. తిరుమల లక్ష్మణ, చిన్నలక్ష్మమ్మ, విజయ్‌ప్రశాంత్, శాంతికుమారి అనే నలుగురు మృత్యువాత పడ్డారు. ఈ ఘటన స్థానికులను కలచివేయగా వేడుక ఇంట, మృతుల స్వగ్రామాల్లో విషాదం అలుముకొంది. బాధితులను వైద్యం కోసం బి.కొత్తకోట సీహెచ్‌సీ, తర్వాత మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కాపాడేందుకు ప్రయత్నించి..

వడిగలవారిపల్లెకు చెందిన తిరుమల లక్ష్మణ (53) బి.కొత్తకోటలో స్థిరపడ్డారు. స్థానికంగా వ్యాపారాలు చేసుకొంటూ కుటుంబంతో జీవిస్తున్నారు. కానుగమాకులపల్లె విద్యుత్ షాక్ ఘటన సమయంలో లక్ష్మణ సహపంక్తి భోజనం చేస్తున్నారు. గాలికి షామియాన విద్యుత్ తీగలపై పడి దానికి అమర్చిన ఇనుప పైపు భోజనం చేస్తున్న టేబుల్‌పై పడింది. దీంతో విద్యుత్‌షాక్ తగిలి ములకలచెరువుకు చెందిన టి.సునిత (38) షాక్ గురికావడం గమనించి ఆమెను కాపాడే ప్రయత్నంలో విద్యుదాఘానికి గురయ్యాడు. చికిత్సకోసం బి.కొత్తకోట సీహెచ్‌సీకి తరలిస్తుండగా మృతి చెందాడు. లక్ష్మణ..కొంతకాలంగా కుమార్తెకు వివాహం చేసే ప్రయత్నాల్లో ఉండగానే మృతి చెందడం కుటుంబీకులను కలచివేస్తోంది.

కోరిక తీరకనే..

వడిగలవారిపల్లెకు చెందిన శాంతికుమారి (53) ఆశ తీరకనే మృతి చెందారు. కానుమాకులపల్లెలో గృహప్రవేశానికి వెళ్లి విద్యుత్‌షాక్‌కు గురికాగా వైద్యం కోసం బెంగళూరు తరలిస్తుండగా మృతి చెందారు. మదనపల్లెకు చెందిన శాంతికుమారికి వడిగలవారిపల్లెకు చెందిన తిరుమల రాజాతో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం కాగా 10పదేళ్లపాటు బెంగళూరులో, బి.కొత్తకోటలో పదేళ్లు నివాసం ఉన్నారు. శాంతికుమారికి స్వస్థలం మదనపల్లెలో నివాసం ఉండాలని కోరిక. దీనితో వీరి కుటుంబం ఏడాదిన్నర క్రితం మదనపల్లెకు వెళ్లి అక్కడ సొంతింటిని నిర్మించుకుని గత ఫిబ్రవరిలో గృహప్రవేశం చేశారు. సొంతింటిలో ఇష్టమైన మదనపల్లెలో జీవించాలన్న కోరిక పూర్తిగా తీరకనే మృత్యుఒడి చేరారు.

ముగ్గురిని కాపాడిన సునీత

కానుగమాకులపల్లె ఘటనలో విద్యుత్‌షాక్‌కు గురైన ములకలచెరువుకు చెందిన తోట గిరి భార్య సునీత ముగ్గురిని కాపాడింది. సుడిగాలికి షామియాన ఎగిరిపోతూ దానికి అమర్చిన ఇనుపపైపు కదిలిపోతుండగా సునీత పడకుండా పట్టుకునే ప్రయత్నం చేసింది. పట్టుకున్న తర్వాత విద్యుత్‌ప్రసరణ జరగడంతో షాక్‌కు గురైంది. పైపును సునీత పట్టుకోకుండా ఉంటే బి.కొత్తకోటకు చెందిన ఎస్.విశ్వనాథరెడ్డి, వడిగలవారిపల్లెకు చెందిన తిరుమల సంతోష్ (మృతురాలు శాంతికుమారి మరిది), పెద్దతిప్పసముద్రం మండలం కుర్రవాండ్లపల్లెకు చెందిన కే.జగదీశ్వర రెడ్డి ప్రమాదం బారిన పడేవాళ్లు. సునీత ప్రయత్నం వల్ల వీరికి ప్రమాదం తప్పినా ఆమెకు గాయాలయ్యాయి. ఆమెను బెంగళూరుకు తరలించారు.

కాపాడే ప్రయత్నాల్లో నారాయణరెడ్డి..

పెద్దతిప్పసముద్రం మండలం నారాయణపల్లెకు చెందిన నారాయణరెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండా సిద్దార్థ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. కానుగమాకులపల్లె ఘటన సమయంలో అక్కడే ఉన్నాడు. బాధితులను తాడు సహాయంతో పలువురిని కాపాడేందుకు ప్రయత్నించాడు.

▶▶మృత్యువులో తోడుగా అవ్వ..మనవడు

కొత్తపల్లెకు చెందిన కే.చిన్నలక్ష్మమ్మ (75) కుమారుడు కే.రామమోహన్, మనవడు కే.విజయ్‌ప్రశాంత్ (23). కానుగమాకులపల్లెలో గృహప్రవేశానికి వెళ్లగా భోజనం చేస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురయ్యారు. అవ్వ లక్ష్మమ్మ, మనవడు ప్రశాంత్‌లు ఒకేచోట విగత జీవులుగా పడివుండటం చూపరులను తీవ్రంగా కలచివేసింది. సరిగ్గా ఏడాది క్రితం రామమోహన్‌ను బైక్ ఢీకొనడంతో మృతి చెందాడు. ఇప్పుడు చిన్నలక్ష్మమ్మ, విజయ్‌ప్రశాంత మృతితో ఏడాదిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడం ఆ ఇంట తీరని విషాదం అలుముకొంది. విజయ్‌ప్రశాంత్ బీటెక్ పూర్తి చేయగా ఇటీవల బెంగళూరు కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఇంటినుంచే ఉద్యోగం చేస్తున్నాడు. ఇప్పుడు విజయ్ కుటుంబంలో తల్లి సరళమ్మ, అన్న జయప్రకాష్ ఉన్నారు.

▶▶జిల్లా ఆసుపత్రికి చేరిన మృతదేహాలు

మదనపల్లె : విద్యుత్‌షాక్ ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలు శుక్రవారం సాయంత్రానికి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి చేరాయి. మరోవైపు క్షతగాత్రులకు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. మదనపల్లె ఆర్డీవో మురళి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, మదనపల్లె జడ్పీటీసీ ఉదయ్‌కుమార్‌లు ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు.



ఆసుపత్రిలో ప్రమాద బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

ముగ్గురికి తీవ్రగాయాలు

- చికిత్స కోసం బెంగళూరుకు తరలింపు
- బి.కొత్తకోట ఆస్పత్రిలో విషాదం
- ప్రమాదంపై ఎంపీ, ఎమ్మెల్యే దిగ్భ్రాంతి
- ఘటనపై డీఎస్పీ కేశప్ప విచారణ



గాయపడిన సునీత



వడిగల సుబ్బమ్మ



తిమ్మయ్య

బి.కొత్తకోట: గృహప్రవేశ వేడుకకు వెళ్లి విద్యుత్ షాక్ ప్రమాదానికి గురైన ముగ్గురు బాధితులను మెరుగైన వైద్యం కోసం శుక్రవారం రాత్రి మదనపల్లె నుంచి బెంగళూరుకు తరలించారు. తీవ్రంగా గాయపడిన బి.కొత్తకోటకు చెందిన తిరుమల లక్ష్మణ (53), ములకలచెరువుకు చెందిన తోట సునీత (38), బి.కొత్తకోట మండలం వడిగలవారిపల్లెకు చెందిన వడిగల సుబ్బమ్మ (70), పెద్దతిప్పసముద్రం మండలం కానుగమాకులపల్లెకు చెందిన సాకల తిమ్మయ్య (40)లను ఘటనాస్థలి నుంచి వైద్యం కోసం బి.కొత్తకోట సీహెచ్‌సీకి తరలించారు. వీరిలో మార్గమధ్యలో లక్ష్మణ మృతి చెందగా మిగిలిన ముగ్గురికి వైద్యులు చికిత్సలు అందిస్తున్నారు. ఆస్పత్రిలో బాధితులు, మృతి చెందిన లక్ష్మణ కుటుంబీకులు, బంధువులు, మిత్రుల రోదనలు, ఆర్తనాదాలతో విషాద వాతావరణం నెలకొంది. గాయపడిన బాధితులను వైద్యం కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడినుంచి బెంగళూరుకు తరలించారు.

ఘటనాస్థలం పరిశీలన

కానుగమాకులపల్లె ఘటనా స్థలంను మదనపల్లె డీఎస్పీ కేశప్ప, రూరల్ సీఐ సత్యనారాయణ, ములకలచెరువు సీఐ సాధిక్‌అలీ, ఎస్‌ఐలు మధు రామచంద్రుడు, రామమోహన్‌లు పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగింది, ఇందులో ఎవరి నిర్లక్ష్యం ఉంది తదితర వివరాలను సేకరించారు. స్థానికులను విచారించారు.

ఎంపీ, ఎమ్మెల్యే దిగ్భ్రాంతి

ప్రమాద ఘటనపై ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి దిగ్భ్రాంతి చెందారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో జరిగిన ఈ దుర్ఘటనపై ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. నలుగురు మృతి చెందిన ఘటన తమను కలచివేసిందని పేర్కొన్నారు. గాయపడిన బాధితులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు. కాగా మృతులైన లక్ష్మణ, శాంతికుమారిలు వైఎస్సార్‌సీపీ నాయకుడు, సింగిల్‌విండో చైర్మన్ తిరుమల అమరనాథ్‌కు సోదరుడు, వదిన అవుతారు. శనివారం ఎంపీ, ఎమ్మెల్యే... మృతుల స్వగ్రామాలకు వెళ్లి కుటుంబీకులను పరామర్శిస్తారని అమరనాథ్ తెలిపారు.

మహనీయుడి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుందాం



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్: కడపలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం బీఆర్ అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎస్పీ అన్బురాజన్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, ఏఆర్ డీఎస్పీ రమణయ్య, ఆర్‌ఐలు వీరేష్, సోమశేఖర్ నాయక్, ఆర్‌ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమున్నత విజ్ఞానమూర్తి అంబేడ్కర్

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు

కడప కార్పొరేషన్: భారతరత్న డా. బీఆర్ అంబేడ్కర్ సమున్నత విజ్ఞాన మూర్తి అని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఎస్సీ విభాగం అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, బడుగు వర్గాల శ్రేయస్సు కోసం, దేశాభ్యుదయం కోసం అంబేడ్కర్ జీవితాన్ని అంకితం చేశారన్నారు. అంబేడ్కర్ ఆశయాల మేరకు దివంగత వైఎస్ఆర్ పాలన చేశారని, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా రెండు అడుగులు ముందుకేసి దళిత, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్‌బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ యానాదయ్య, పార్టీ నాయకులు వేణుగోపాల్ నాయక్, సుభాన్‌బాషా, జి. గరుడాద్రి, సుబ్బారెడ్డి, పి. సంపత్‌కుమార్, శ్యాంసన్, పస్తం అంజి, కె. బాబు, రామచంద్రయ్య, సంధ్యారాణి, జ్యోతి, చైతన్య పాల్గొన్నారు.

ఘన నివాళి



బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

వేంపల్లె : బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నివాళులర్పించారు. శుక్రవారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులతో కలసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ అంబేడ్కర్ సేవలను కొనియాడారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం

- వేసవి కాలంలో అత్యవసర సేవలకు అందుబాటులో సిబ్బంది
- జిల్లాలో మొత్తం 11 వాహనాలు, రెండు మిస్ట్‌లు, రెండు బుల్లెట్ వాహనాలు





కడప కలెక్టరేట్‌లోని అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి కార్యాలయం, కడపలోని అగ్నిమాపక కేంద్రం, అందులోని వాహనాలు

కడప అర్బన్: భగభగ మండే వేసవి సమయంలో నివాస, అటవీ, ఇతర ప్రాంతాలలో అగ్నిప్రమాదాలకు, ఇతర ప్రమాదాలకు అవకాశాలు ఎక్కువ. వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగితే వెంటనే స్పందించేందుకు జిల్లాలోని అగ్నిమాపక శాఖల అధికారులు సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ఎలాంటి ఆపదనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారు.

జిల్లాలో ఫైర్‌స్టేషన్‌ల వివరాలు:

జిల్లాలో ప్రస్తుతం 9 అగ్నిమాపక కేంద్రాలున్నాయి. వీటిలో కడప, ప్రొద్దుటూరులలోని అగ్నిమాపక కేంద్రాలకు ప్రత్యేక యూనిట్‌లుగా నిర్ణయించారు. వీటిల్లో రెండేసి వాహనాలు, ఒక్కో కేంద్రంలో మిస్ట్‌వాహనం, బుల్లెట్ వాహనాలు అందుబాటులో ఉన్నాయి. ఇంకా జమ్మలమడుగు, పులివెందుల, కమలాపురం, బద్వేలు, మైదుకూరు, పోరుమామిళ్లతో పాటు వేంపల్లి ఫైర్‌స్టేషనలు ఉన్నాయి. వేంపల్లిలో ఫైర్ స్టేషన్‌ను నిర్మింపచేసి ఏడు నెలల క్రితం కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.

- జిల్లాలో అగ్నిమాపక శాఖలో జిల్లా అధికారి స్థాయి నుంచి హోంగార్డు స్థాయి వరకు 220 పోస్టులు మంజూరు కాగా, వీటిల్లో 146 మంది ప్రస్తుతం విధుల్లో ఉన్నారు.
- జిల్లాలో గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి నెల ఇప్పటివరకు 638 అగ్ని, ఇతర ప్రమాదాలు జరిగాయి... వీటి ద్వారా రూ.7,93,86,598 ఆస్తి నష్టం జరిగింది. రక్షించిన ఆస్తి రూ.23,25,07,000.
- అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే 101కు సమాచారం అందించాలి.

జిల్లాలో అగ్నిమాపక కేంద్రాలు... ఫోన్‌నెంబర్ల వివరాలిలు ఇలా..

ఫైర్‌స్టేషన్/ఆఫీస్ - హోదా పేరు -	ఫోన్‌నెంబర్ స్టేషన్ నెంబరు
డిఎఫ్‌ఓ – బి.వి.ఎస్. రామ్ ప్రకాష్	99499 91068– 08562– 241739
కడప–ఏడీఎఫ్‌ఓ–పి. బసివిరెడ్డి	99637 37191 – 08562– 242299
ప్రొద్దుటూరు–ఏడిఎఫ్‌ఓ–ఏ.రఘునాథ–	99637 37486– 08564–252999
జమ్మలమడుగు–ఎస్‌ఎఫ్‌ఓ–ఎన్.సత్యంరెడ్డి	9963737395–08560–270099
పులివెందుల–ఎస్‌ఎఫ్‌ఓ–సునీల్‌కుమార్	9963737552–08568–286177
కమలాపురం–ఎస్‌ఎఫ్‌ఓ–ఎన్.నాగేశ్వరరెడ్డి	9963737598–08563–274250
బద్వేల్– ఎస్‌ఎఫ్‌ఓ–కె.వెంకటసుబ్బయ్య	9963737553– 08569–284099
మైదుకూరు–ఎస్‌ఎఫ్‌ఓ–జి. శివప్ప	9963737634 – 87902 01101
పోరుమామిళ్ల–ఎస్‌ఎఫ్‌ఓ–వసంతనాయక్	9963737637–08569–210310
వేంపల్లి – ఎస్‌ఎఫ్‌ఓ – డి. శివకుమార్	80086 69522

తక్షణమే సేవలందిస్తాం



అవకాశం ఉన్నపుడల్లా... స్కూల్స్, కాలేజీలు, హాస్పిటల్స్, షాపింగ్‌మాల్స్‌లలో, కడప నగర శివార్లలోని ఐఓసి గ్యాస్ ప్లాంట్, కర్మాగారాలలో అగ్నిమాపక అధికారుల పర్యవేక్షణలో విన్యాసాలు ప్రదర్శిస్తున్నాం. ప్రమాదాలు సంభవించినపుడు తక్షణమే స్పందించి సేవలు అందిస్తున్నాం.

– బి.వి.ఎస్. రామ్ ప్రకాష్, అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి, వైఎస్సార్ జిల్లా

ఆధ్యాత్మిక నిలయం.. చిన్మయారణ్యం

- మారుమూల గ్రామంలో మార్మోగుతున్న హరినామం
- గోశాల, పాఠశాల నిర్వహణ
- మొక్కలు పెంచి, అడవి ఏర్పాటు
- పేదలకు సైతం సాయం

'మానవ సేవే మాధవ సేవ' అన్నారు పెద్దలు. ఈ విషయాన్ని అక్కడ తూచా తప్పకుండా పాటిస్తున్నారు. భావి భారత పౌరులుగా పేద విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. గోవుల సంరక్షణే ధ్యేయంగా గోశాల నిర్వహిస్తున్నారు. రేపటి తరానికి చక్కటి వాతావరణం అందించాలనే లక్ష్యంతో.. మొక్కలు పెంచి ఏకంగా అడవినే తయారు చేశారు. సువిశాల ప్రదేశం, ప్రశాంత వాతావరణంలో ఆశ్రమం నెలకొల్పి.. సమాజానికి ఎన్నో సేవలు అందిస్తున్నారు. అందం, పచ్చదనానికి అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలం ఎల్లాయపల్లెలోని చిన్మయారణ్యం ఆశ్రమం చిరునామాగా నిలుస్తోంది.



ఎల్లాయపల్లెలో చిన్మయారణ్యం ఆశ్రమ ముఖద్వారం

సాక్షి, కడప డెస్క్ : అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలం ఎల్లాయపల్లెలో ఆధ్యాత్మికతకు నిలయంగా పచ్చని వాతావరణంలో చిన్మయారణ్య ఆశ్రమం నిర్వహిస్తున్నారు. దీనిని మాతాజీ శారదా ప్రియానంద నెలకొల్పారు. ఆమె ఎంఏ, ఎల్ఎల్‌బీ చదివి హైదరాబాద్ దుర్గా బాయి దేశ్‌ముఖ్ సోషల్ వెల్ఫేర్ ఫౌండేషన్‌లో అధికారిణిగా పని చేస్తుండే వారు. అప్పట్లో రెండవ వివేకానందునిగా పేరు గాంచిన స్వామి చిన్మయానంద ప్రపంచ వ్యాప్తంగా ధర్మప్రచారం చేస్తున్న సమయంలో.. ఆయన శిష్యురాలిగా చేరారు. ముంబయి, హిమాలయాల్లో శిష్యరికం చేసి సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆమెను ఎల్లాయపల్లె గ్రామస్తులు కలిసి.. తమ ఊరిలో ఆశ్రమం ఏర్పాటు చేయాలని కోరారు. ఆశ్రమం కోసం వారు దాదాపు 24 ఎకరాల భూమిని వితరణగా ఇచ్చారు. అయితే అక్కడ నీళ్ల లేక బీడుగా ఉండి, వ్యవసాయానికి పనికి రాని భూమిలో ఆశ్రమం ఎలా నిర్మించాలని ప్రియానంద సందేహం వ్యక్తం చేశారు. తన గురువు శివస్మరణతో గంగ వస్తుందని ఆదేశించడంతో 1982లో ఫిబ్రవరి 8న చిన్మయానంద ఆశ్రమ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయన కంచె చుట్టూ తిరుగుతూ కొన్ని చోట్ల గుర్తులు పెట్టారని, అక్కడ బోర్లు వేయించగా గంగమ్మ ఉప్పొంగిందని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. సమీపంలోనే చుట్టుపక్కల గ్రామాల ప్రజలు బోర్లు వేయగా, ఎక్కడా నీరు పడకపోవడం ఆశ్చర్యకరం.

నిత్యం బోధనలు

ఆశ్రమంలో ఆధ్యాత్మికత, భగవద్గీత, సనాతన ధర్మంపై నిత్యం బోధనలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం పెద్ద ఆడిటోరియం నిర్మించారు. 1988లో నర్మదా నదిలో నుంచి తెచ్చిన శివలింగంతో శివాలయం నిర్మించారు. 1989లో ధ్యానం చేసేందుకు పిరమిడ్ ఆకారంలో తపోవన ధ్యాన మందిరం ఏర్పాటు చేశారు. మాతాజీ నివసించే కుటీరాలను ఎంతో ఆహ్లాదకర వాతావరణంలో నిర్మించారు. ఐదు, ఆరు గోవులతో మొదలైన గోశాలలో.. ప్రస్తుతం 47 గోవులు ఉన్నాయి. 2000లో శారదా ప్రియానంద శివైక్యం పొందారు. విశాలమైన ప్రదేశంలో కృష్ణ మందిరం, శారదా ప్రియానంద సమాధి నిర్మించారు.

నిత్యావసరాల పంపిణీ

మాతాజీ శారదా ప్రియానంద ఆశ్రమం అభివృద్ధి చేస్తున్న దశలో.. పేదరికం ఎక్కువగా ఉండి కనీసం భోజనం దొరకని దయనీయ పరిస్థితులు ఉండేవి. ఇక్కడ ఫ్లోరైడ్ నీరు కావడంతో వ్యాధుల బారిన పడి, నడవలేని స్థితిలో ఉండేవారు. ఒక రోజు ఆశ్రమానికి భోజనం సమయంలో 60 ఏళ్ల వృద్ధుడు వచ్చి అన్నం పెట్టాలని వేడుకున్నాడు. అప్పుడు భోజనం పెట్టారు. మరుసటి రోజు అదే సమయానికి 16 మంది రావడంతో.. ఆశ్రమంలోని వారి భోజనం అందించారు. అలా రోజూ వస్తూ, ఆశ్రమంలో చిన్న చిన్న పనులు చేసే వారు. ఒక రోజు వారందరినీ ఇకపై ఇలా రావద్దని, ప్రతి వారం వచ్చి నిత్యావసర సరుకులు ఉచితంగా తీసుకుని వెళ్లాలని సూచించారు. 1985లో హరిసేవ పేరుతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమీప గ్రామాలైన పాపిరెడ్డిపల్లె, వడ్డిపల్లె, ఎస్టీ కాలనీలలో 60 పేద కుటుంబాలకు పక్కా భవనాలు నిర్మించారు. ఎస్టీ కాలనీలో సంచార పేద కుటుంబాలకు జీవనోపాధి లేకపోవడంతో.. వారికి ఒకటిన్నర ఎకరాల వ్యవసాయ భూమి ఇచ్చారు. అందులో వారు కూరగాయలు పండించి, ఆశ్రమానికి విక్రయించి జీవనోపాధి పొందేవారు. ఆశ్రమం ప్రతినిధులు రోజూ అక్కడికి వెళ్లి వ్యవసాయంలో మెళకువలు నేర్పించేవారు.

86 ఎకరాల్లో మొక్కల పెంపకం

1990 దశకంలో అప్పటి కలెక్టర్ రమణాచారి 86 ఎకరాల ప్రభుత్వ భూమి ఇచ్చారని, మాతాజీ శారదా ప్రియానంద భవిష్యత్తు తరాల వారికి చక్కటి వాతావరణం అందించాలనే లక్ష్యంతో మొక్కలు పెంచారని ఆశ్రమ వాసి శ్రేయానంద తెలిపారు. ప్రతి విద్యార్థి చేత మొక్కలు నాటించి, వారిచే సంరక్షణ కల్పించారని, అవి ప్రస్తుతం పెద్దవై అడవి మాదిరిగా మారిందని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఆశ్రమానికి వచ్చి ఇక్కడ ప్రశాంతత పొందుతుంటారని అన్నారు. పాఠశాలలో ప్రస్తుతం కంప్యూటర్ ల్యాబ్, బయాలజీ ల్యాబ్, డిజిటల్ తరగతి గదులు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం మాతాజీ శీలానంద ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నారని, ఆమె ఆధ్వర్యంలో ఆధ్యాత్మికత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు.

ఇద్దరు పిల్లలతో మొదలై..

1983లో గుంటూరులో మాతాజీ శారదా ప్రియానంద ఉపన్యాసం ఇచ్చారు. తర్వాత అక్కడ ఉన్న వారు ఇద్దరు నెలల బిడ్డలను తీసుకొని వచ్చి.. మీ ఆశ్రమానికి తీసుకెళ్లాలని కోరారు. వారిని ఆమె ఇక్కడికి తీసుకొని వచ్చారు. చిన్మయారణ్యం ఆశ్రమంలో చిన్మయ హరిహర విద్యాలయం ఏర్పాటు చేసి, అందులో చేర్చారు. మొదట ఇంగ్లిష్ మీడియం ఏకోపాధ్యాయ పాఠశాల ఏర్పాటు చేశారు. అలా మొదలైన పాఠశాలలో ప్రస్తుతం 448 మంది విద్యార్థులు చదువుతున్నారు. చదువుతోపాటు ఆధ్యాత్మికత, సనాతన ధర్మం, ఆచారాలు, పెద్దల పట్ల ఏ విధంగా నడుచుకోవాలి, సభ్యత, సంస్కారంతో కూడిన విద్య అందిస్తున్నారు. నర్సరీ నుంచి పదో తరగతి వరకు ఏర్పాటు చేశారు. ఆశ్రమ వాసి శ్రేయానంద మాట్లాడుతూ నామమాత్రపు ఫీజులతో పాఠశాల నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇతర జిల్లాల నుంచి కూడా వచ్చి ఇక్కడ చదువుకుంటున్నారని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల వారు 63 మంది ఉండగా, వారిలో 41 మందికి ఉచితంగా వసతి, భోజనం కల్పిస్తున్నామని, మిగతా వారికి స్వల్ప ఫీజు తీసుకుంటున్నట్లు చెప్పారు.


మాతాజీ శారదా ప్రియానంద సమాధి


నర్మదా నది నుంచి తీసుకొచ్చిన శివలింగం


విద్యాలయంలో ధ్యానం చేస్తున్న విద్యార్థులు


చిన్మయారణ్యంలోని చిన్మయ హరిహర పాఠశాల


స్వామి చిన్మయానంద విగ్రహం


ఆశ్రమంలోని గోశాల


ఆహ్లాదకర వాతావరణంలో మాతాజీ శీలానంద కుటీరం

విలువలతో కూడిన విద్య

ధనార్జనే ధ్యేయం కాకుండా మారుమూల గ్రామాల, పేద విద్యార్థులకు ఆధ్యాత్మికత, విలువలతో కూడిన విద్య అందిస్తున్నాం. పాఠశాలలో అభయాంజనేయ స్వామి ఆలయం ఏర్పాటు చేయడం జరిగింది. ఇక్కడ చదివిన వారు ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో రాణిస్తున్నారు.

– సీహెచ్ హరినాథ్, ప్రధానోపాధ్యాయుడు, హరిహర పాఠశాల, ఎల్లాయపల్లె



17న ద్విచక్రవాహనాల వేలం

కడప అర్బన్ : కడప ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో కొంత కాలంగా వుండిపోయిన, ఎవరూ క్లెయిమ్ చేయని 33 ద్విచక్రవాహనాలను ఈ నెల 17న వేలం వేయనున్నట్లు కడప ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వేలంలో పాల్గొనే వారు ఈ నెల 17న కడప ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణానికి హాజరు కావాలని సీఐ కోరారు.

మహిళ ఆత్మహత్య


వరలక్ష్మి మృతదేహం

కడప అర్బన్ : కడప నగరం రాజీవ్ పార్క్ ఎదురుగా వున్న వీధిలోని మారుతీనగర్‌లో నివాసం వుంటున్న లోమడ వరలక్ష్మి(36) శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. సమాచారం వచ్చిన వెంటనే కడప ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు ఆదేశాల మేరకు ఎస్‌ఐ జి.మధుసూదన్‌రెడ్డి తమ సిబ్బందితో వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. లోమడ కిరణ్‌కుమార్‌రెడ్డి అలియాస్ శేషుకు, వరలక్ష్మికి కొన్ని సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు వున్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి రెండేళ్ల కిందట కరోనా వ్యాధి వచ్చి ప్రాణాలు కోల్పోయాడు. తన ఇంటి వద్దనే వరలక్ష్మి బొటిక్ నడుపుకుంటూ జీవనం సాగించేది. మానసిక వేదనతో ఇంటిలో ఎవరూ లేని సమయంలో తన చున్నీతో ఇంటిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇద్దరు కుమారులు పాఠశాల నుంచి రాగానే తన తల్లి పలుకకపోవడంతో స్థానికుల సహకారంతో ఇంటిని పరిశీలించారు. వరలక్ష్మి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో వెంటనే తలుపు గడియను పగులగొట్టి ఆమెను కిందికి దించారు. అప్పటికే ఆమె మృతి చెందింది. ఆమె బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలియజేశారు.

వెంటాడిన మృత్యువు

- పరీక్షకు వెళ్తుండగా ప్రమాదం
- ఆసుపత్రికి తరలిస్తుండగా అంబులెన్స్ బోల్తా
- విద్యార్థి మృతి, తల్లిదండ్రులకు గాయాలు


అరుణ్‌కుమార్ (ఫైల్)

ముద్దనూరు : ఓ విద్యార్థిని మృత్యువు వెంటాడింది. ప్రమాదం జరిగి కోలుకోక ముందే మరో ప్రమాదం చోటు చేసుకుంది. విషాదకర సంఘటన వివరాలలోకి వెళ్తే ... మండలంలోని బొందలకుంట గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్ (18) అనే విద్యార్థి ఇంటర్మీడియెట్ ఓపెన్ పరీక్ష రాయడానికి మోటార్ బైక్‌పై గురువారం జమ్మలమడుగుకు వెళ్తుండగా ముద్దనూరు-జమ్మలమడుగు మార్గంమధ్యలో అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో అతను తీవ్ర గాయాలపాలయ్యాడు. బాధితుడిని చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. ఈ ప్రమాదంలో క్షతగాత్రుడు కోమాలోకి వెళ్లాడు. దీంతో కర్నూలులో పరిస్థితి విషమించడంతో వైద్యులు కడప రిమ్స్‌కు వెళ్లి అక్కడే చికిత్స తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. అరుణ్ తల్లిదండ్రులు అంబులెన్స్‌లో కడప రిమ్స్‌కు బయలుదేరారు. గురువారం రాత్రి కడపకు వస్తుండగా ఖాజీపేట వద్ద హైవేపై వంతెనను ఢీకొని అంబులెన్స్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అరుణ్‌కుమార్ మృతి చెందాడు. అతడి తల్లిదండ్రులకు తీవ్ర గాయాలయ్యాయి. కుమారుడి మరణంతో ఆ తల్లిదండ్రులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

ఐదుగురు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్ట్


స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు

కడప అర్బన్ : ఐదుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 23 దుంగలు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలోని పెండ్లిమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పారిపోతున్న స్మగ్లర్లను వారు పట్టుకున్నారు. కడపలోని పోలీసు కార్యాలయ ఆవరణలో 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వివరాలు వెల్లడించారు. మూడేళ్లుగా పోలీసుల కళ్లుగప్పి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న గ్యాంగ్‌లోని ప్రధాన స్మగ్లర్ గుమ్మల వెంకటేష్‌తోపాటు ఇతర స్మగ్లర్లు పునగాని దినేష్, గుమ్మళ్ల సాయి, చుక్కా రాజశేఖర్, గుమ్మళ్ల రమణయ్యను అరెస్ట్ చేశారన్నారు. వారంతా అన్నమయ్య జిల్లా వాసులేనన్నారు. వీరికి పలువురు అంతర్జాతీయ స్మగ్లర్లతో సంబంధాలున్నాయని విచారణలో వెల్లడైందన్నారు. స్మగ్లర్ల సమాచారాన్ని ప్రజలు డయల్ 100కు గానీ, 94407 96900కు సమాచారమివ్వాలన్నారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ పర్యవేక్షణలో స్మగ్లర్లను అరెస్ట్ చేసిన ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ చెంచుబాబు, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగభూషణ్, కడప రూరల్ సీఐ కె.అశోక్‌రెడ్డి, ఆర్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, పెండ్లిమర్రి ఎస్‌ఐ నర్రెడ్డి రాజరాజేశ్వర్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి, నగదు రివార్డులను అందజేశారు.

పులివెందుల ఎస్‌ఆర్‌ఓపై మరో కేసు

మదనపల్లె : న్యాయస్థానం ఆదేశాలతో పులివెందుల ఎస్ఆర్‌ఓతోపాటు మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెకు చెందిన సులోచన ప్రధాన నిందితురాలిగా ఆరుగురిపై పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 10న చీటింగ్ కేసు నమోదైంది. ఈ విషయం మరువకనే ఇదే విషయమై మదనపల్లె పట్టణ వన్‌టౌన్‌లో కోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం మరో చీటింగ్ కేసు నమోదు అయ్యింది. ఈ కేసు వివరాలను ఎస్‌ఐ హరిహర ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన కట్టా సులోచన, మార్వారి అబ్బయ్యగారివీధికి చెందిన వెంకటేశ్వర్ల నాయుడు మధ్య కొంత కాలంగా స్థానిక నీరుగట్టువారిపల్లె టమాట మార్కెట్‌యార్డు పక్కన ఉన్న సర్వే నంబరు 36/1లోని స్థలం విషయమై వివాదం నడుస్తోంది. అయితే ఆ స్థలాన్ని సులోచన తన అనుచరులైన మదనపల్లె అనుపగుట్టకు చెందిన గోవిందు, శ్రీసత్యసాయిజిల్లాకు చెందిన గుడిగళ్ల మోహన్, భాస్కర్, జి.మోహన్‌లతో కలిసి కొద్ది రోజుల కిందట పులివెందుల ఎస్ఆర్‌వో సహకారంతో ఫోర్జరీ సంతకాలతో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. భూమికి సంబంధించి జనరల్ పవర్ ఆఫ్ పట్టా (జీపీఏ)ను తారుమారు చేసి స్థలాన్ని విక్రయించినట్లు బాధితుడు వెంకటేశ్వర్లు నాయుడు ఆరోపిస్తూ మదనపల్లె కోర్టులో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం బాధ్యులపై కేసు నమోదు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు వన్‌టౌన్ పోలీసులు నిందితులైన కట్టా సులోచన, పులివెందుల ఎస్ఆర్‌వో, ఆమె అనుచరులు గోవిందు, గుడిగళ్ల మోహన్, భాస్కర్, జి.మోహన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. టూటౌన్‌లో నమోదు చేసిన చీటింగ్ కేసుకు సంబంధించి 719/2023 రిజిస్ట్రేషన్ నంబరుతో డాక్యుమెంట్ సృష్టించగా, వన్‌టౌన్‌లో నమోదైన చీటింగ్ కేసులో 725/2023 రిజిస్ట్రేషన్ నంబరుతో డాక్యుమెంటు సృష్టించినట్లు పేర్కొనడం గమనార్హం. రోజుల వ్యవధిలోనే పులివెందుల ఎస్ఆర్‌వోపై ఒకే స్థల విషయమై మరో చీటింగ్ కేసు నమోదు కావడం తీవ్ర చర్చనీయాంశమైంది.

24 గంటల్లోనే దొంగ అరెస్ట్


నిందితుడి అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉలసయ్య

కడప అర్బన్ : చోరీ కేసును 24 గంటల్లోనే పోలీసులు ఛేదించి, నిందితుడిని అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కడప తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో రవీంద్రనగర్ విలాసంబావి వీధిలో నివాసం వుంటున్న కందుకూరు కీర్తిక, తన భర్త సత్య చైతన్య గౌడ్‌తో కలిసి గురువారం రాత్రి ఇంటికి తాళం వేశారు. రాత్రి 7:45 సమయంలో పిల్లలను ట్యూషన్ నుంచి తీసుకుని రావడానికి వెళ్లారు. ఆ సమయంలో కడప నగరం చిలకలబావి వీధికి చెందిన షేక్ అక్బర్ ఆలీ.. వారి ఇంటి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించాడు. మూడు తులాల బరువున్న నల్లపూసల దండను దొంగలించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. షేక్ అక్బర్ ఆలీని శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి రూ.1.50 లక్షల విలువైన మూడు తులాల బంగారు నల్లపూసల దండను రికవరీ చేశారు. అతను గతంలో క్రికెట్ బెట్టింగ్, దొంగతనం కేసులలో కడప తాలూకా, కడప ఒన్‌టౌన్, టూటౌన్, చిన్నచౌక్ పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లి బెయిల్ మీద బయటకు వచ్చాడు. రాగానే ఈ చోరీకి పాల్పడి, మరలా జైలుకు వెళ్లాడు. చోరీ కేసును 24 గంటల్లోపే ఛేదించిన కడప డీఎస్పీ క్రైమ్ సిబ్బంది హెడ్‌కానిస్టేబుల్ పాకా సురేష్, కానిస్టేబుల్స్ చంద్రనారాయణరెడ్డి, కిరణ్, కడప తాలూకా ఎస్‌ఐ తాహీర్ హుసేన్, హెడ్‌కానిస్టేబుల్ సుబ్బరాయుడు, కానిస్టేబుల్ ఓబులేసు, హోంగార్డు గౌస్‌బాషా, సీపీఓ నజీర్‌లను జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అభినందించినట్లు కడప తాలూకా సీఐ ఉలసయ్య తెలియజేశారు.

గంజాయి ముఠా ఆటకట్టు

22.4 కిలోల గంజాయి, 7 సెల్‌ఫోన్‌లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : జిల్లాలోని ప్రొద్దుటూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు చేస్తున్న ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 22.4 కిలోల గంజాయిని, ఏడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయం వద్ద వున్న 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వివరాలు వెల్లడించారు. గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న వారే కాకుండా చిన్న చిన్న పొట్లాల్లో విక్రయిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారిలో ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన ఓబురాయి తులసి అనే మహిళతోపాటు, జిల్లాలోని కడప నగరం ఇందిరానగర్‌లో నివాసం వుంటున్న రెబ్బా సతీష్, భగత్‌సింగ్ నగర్‌కు చెందిన ప్యారీ, ఎర్రగుంట్లకు చెందిన ఎస్.ఇమాంబాషా, షేక్ టప్పి వలీ, వల్లూరు మండలం పైడికాల్వకు చెందిన ఎస్.లక్ష్మయ్య, ఎర్రగుంట్లకు చెందిన ఎస్. శ్రీనులు వున్నారు. వీరిలో ఇద్దరు మహిళలున్నారు. ప్రజలు గంజాయి విక్రయాలు, వినియోగించే వారి సమాచారం డయల్ 100 లేదా తన ఫోన్ నంబర్ 94407 96900కు ఇవ్వాలని ఎస్పీ సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ చెంచుబాబు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజా ప్రభాకర్, ప్రొద్దుటూరు త్రీటౌన్ సీఐ నారాయణ యాదవ్, ఎస్‌ఐ కృష్ణంరాజు నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.